సమస్యలు పరిష్కరించాలని డిప్యూటీ సీఎంకు వినతి



భట్టి విక్రమార్కకు వినతిపత్రం అందజేస్తున్న బంజారా విద్యార్థి సంఘం నాయకులు

కేపీహెచ్‌బీకాలనీ: దళిత, గిరిజన విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని బంజారా విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం చైర్మన్ నరేందర్ నాయక్, జేఎన్‌టీయూహెచ్ బంజారా విద్యార్థి సంఘం అధ్యక్షులు ధరావత్ వినోద్ నాయక్ మాట్లాడుతూ.. మారుమూల గిరిజన ప్రాంతమైన ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ ప్రాంతంలో జేఎన్‌టీయూ కళాశాల ఏర్పాటు చేయాలని, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు మెస్ ఫీజులు ప్రభుత్వమే చెల్లించే విధంగా నూతన జీవో ఇవ్వాలని కోరారు. ఉచిత కోచింగ్ సౌకర్యాన్ని జేఎన్‌టీయూ క్యాంపస్‌లో ఏర్పాటు చేయాలన్నారు. ఎస్సీ, ఎస్టీ సెల్ డైరెక్టర్ పదవిని జేఎన్‌టీయూహెచ్‌లో ఏర్పాటు చేయాలని కోరారు.

బీఆర్‌ఎస్ నాయకుల గృహ నిర్బంధం



అల్లాపూర్ డివిజన్ కార్పొరేటర్ సబిహా బేగం, మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షులు మహ్మద్ గౌసుద్దీన్



పోలీసుల అదుపులో బీఆర్‌ఎస్ అల్లాపూర్ డివిజన్ నాయకులు

ఆగ్రహం వ్యక్తం చేసిన ఎమ్మెల్యే

కూకట్‌పల్లి: అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా ట్యాంక్‌బండ్ వద్ద ఉన్న విగ్రహానికి నివాళులర్పించటానికి వెళ్లకుండా పోలీసులు కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, బీఆర్‌ఎస్ కార్పొరేటర్‌లు, పలువురు ముఖ్య నాయకులను ఉదయం పోలీసులు శుక్రవారం గృహ నిర్బంధం చేశారు. ఏం తప్పు చేశామని హౌస్ అరెస్టు చేస్తున్నారని పోలీసులను ఎమ్మెల్యే కృష్ణారావు ప్రశ్నించారు. ఉదయమే పోలీసులు ఇంటికి వచ్చి తమ పనులకు అడ్డంకి కల్పించటం దారుణమన్నారు.



గృహ నిర్బంధంలో ఎమ్మెల్యే కృష్ణారావు, కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ

డ్రగ్స్‌పై ఐక్యంగా పోరాడాలి

హెచ్‌సీయూ వీసీ ప్రొ.బీజేరావు

రాయదుర్గం: డ్రగ్స్ రహిత సమాజం కోసం ఐక్యంగా పోరాడాల్సిన అవసరాన్ని అందరూ గుర్తించాలని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ బీజేరావు పేర్కొన్నారు. హెచ్‌సీయూ ఎన్ఎస్ఎస్ సెల్ ఆధ్వర్యంలో రాష్ట్ర యాంటీ నార్కోటిక్ బ్యూరో రూపొందించిన పోస్టర్లను వీసీ శుక్రవారం ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యాసంస్థల్లో డ్రగ్స్ సంస్కృతికి దూరంగా ఉండాలన్నారు. ఇటీవల సమాజంలో డ్రగ్స్ వాడకం పెరగడంపై ఆందోళన వ్యక్తం చేశారు. ఇది సామాజిక దురాగతాలకు దారితీస్తోందని ఆయన పేర్కొన్నారు. ఈ డ్రగ్స్ సమస్యను వీలైనంత త్వరగా పరిష్కరించేందుకు ఐక్యంగా కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. హెచ్‌సీయూ రిజిస్ట్రార్ డాక్టర్ దేవేష్ నిగమ్ మాట్లాడుతూ డ్రగ్స్‌పై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. హెచ్‌సీయూ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ బి కృష్ణయ్య మాట్లాడుతూ ఎన్ఎస్ఎస్ సెల్ త్వరలో తెలంగాణ రాష్ట్ర యాంటీ నార్కోటిక్ బ్యూరో సహకారంతో అవగాహనా కార్యక్రమాలను నిర్వహిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌సీయూ అధికారులు, ఎన్ఎస్ఎస్ విభాగం ప్రతినిధులు పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వీసీ ప్రొఫెసర్ బీజేరావు, రిజిస్ట్రార్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్

సాంకేతిక వినియోగంలో ముందుండాలి



శిక్షణలో పాల్గొన్న ఇంజనీర్లు

- వృత్తిలో నైపుణ్యం పెంపుదలకు శిక్షణ అవసరం
- ఎన్ఆర్ఐడీఏ న్యూఢిల్లీ ప్రాజెక్ట్–1 డైరెక్టర్ ప్రదీప్ అగర్వాల్

రాయదుర్గం: ప్రతి ఒక్కరు తమ వృత్తిలో రాణించాలంటే శిక్షణ అవసరమని ఎన్ఆర్ఐడీఏ న్యూఢిల్లీ ప్రాజెక్ట్–1 డైరెక్టర్ ప్రదీప్‌అగర్వాల్ అన్నారు. గచ్చిబౌలిలోని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియాలో సివిల్ అండ్ ట్రాన్స్‌పోర్టేషన్ ఇంజనీరింగ్ డివిజన్, ఎస్కీ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా 36 మంది ఇంజనీర్లకు ప్రత్యేక శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రతి రంగంలో సాంకేతికత వినియోగం మరింత పెరిగితేనే పనుల్లో నాణ్యత పెరుగుతుందన్నారు. సాంకేతిక వినియోగంలో అందరూ ముందుండాలని ఆయన సూచించారు. ఎస్కీ డైరెక్టర్ డాక్టర్ జి రామేశ్వరరావు నాయకత్వంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, అరుణాచల్‌ప్రదేశ్, బిహార్, అస్సాం, ఛత్తీస్‌ఘడ్, గుజరాత్, హిమాచల్‌ప్రదేశ్, తమిళనాడు, కర్నాటక, లడఖ్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర కేరళ, మేఘాలయ, మిజోరామ్, నాగాలాండ్, ఉత్తప్రదేశ్, ఉత్తరాఖండ్‌లకు చెందిన 26 మంది ప్రధానమంత్రి గ్రామ్ సడక్ యోజన ప్రాజెక్టుకు చెందిన ఇంజనీర్లకు అయిదు రోజులపాటు శిక్షణ ఇచ్చారు. రోడ్ల నిర్మాణం, సాంకేతిక వినియోగం, నాణ్యత వంటి అంశాలపై ప్రత్యేక శిక్షణ ఇచ్చారు.

హైటెక్స్‌లో ఇండియా ఇంటర్నేషనల్ ట్రావెల్ మార్ట్ ప్రారంభం

- 3 రోజుల పాటు కొనసాగింపు
- ప్రత్యేక రాయితీలను అందిస్తున్న ట్రావెల్ కంపెనీలు



ట్రావెల్ మార్ట్‌ను ప్రారంభిస్తున్న తెలంగాణ టూరిజం డైరెక్టర్ హనుమత్ కొండిబా తదితరులు

మాదాపూర్: హాస్పిటాలిటీ రంగాలకు చెందిన కీలక వాటాదారులతో ఇండియా ఇంటర్నేషనల్ ట్రావెల్ మార్ట్‌ను శుక్రవారం మాదాపూర్‌లోని హైటెక్స్‌లో తెలంగాణ టూరిజం డైరెక్టర్ జెడ్. హనుమత్ కొండిబా నిర్వాహకులతో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణలో టూరిజం దినదినాభివృద్ధి చెందుతుందన్నారు. ప్రభుత్వం ప్రత్యేక వసతులను కల్పిస్తున్నట్లు తెలిపారు. స్పియర్ ట్రావెల్ మీడియా డైరెక్టర్ రోహిత్ హంగాల్ మాట్లాడుతూ ట్రావెల్ ఏజెంట్లకు సరైన వేదిక అన్నారు. మూడు రోజుల పాటు నిర్వహించనున్న ఈ ప్రదర్శనలో దేశీయ, అంతర్జాతీయ గమ్యస్థానాలు సేవలు, ఆవిష్కరణలను ప్రదర్శిస్తుందన్నారు. ప్రముఖ టూర్ ఆపరేటర్లు, ట్రావెల్ ఏజన్సీలు, స్టేట్ టూరిజం బోర్డులు, అంతర్జాతీయ డెస్టినేషన్ మేనేజ్‌మెంట్ కంపెనీలు పాల్గొన్నాయన్నారు. పుణ్యక్షేత్రాల ప్రయాణం, సాహస క్రీడలు, కుటుంబ సెలవులు హెరిటేజ్, హనీమూన్ వెళ్లేవారికి ఈ ప్రదర్శన ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు.తెలంగాణ, కర్ణాటక, ఉత్తర్‌ప్రదేశ్, గుజరాత్, మధ్యప్రదేశ్, రాజస్థాన్, హిమాచల్ ప్రదేశ్, ఢిల్లీ, తమిళనాడు, కేరళ, టర్కీ , మలేషియా, వియత్నాం వంటి 10కి పైగా దేశాలకు ప్రాతినిధ్యం వహిస్తున్న అంతర్జాతీయ భాగస్వాములతో పాటు 20కి పైగా భారతీయ రాష్ట్రాల నుంచి పర్యాటక వాటాదారులు , బాలి, థాయిలాండ్, నేపాల్, భూటాన్, మాల్దీవులకు మార్కెటింగ్ చేయనున్నట్టు తెలిపారు. ఈ ప్రదర్శనలో పలు ట్రావెల్ కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.



పీజేఆర్ నగర్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న పీఏసీ చైర్మన్ గాంధీ, కార్పొరేటర్ వెంకటేష్‌గౌడ్



కూకట్‌పల్లి వై జంక్షన్ వద్ద నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే కృష్ణారావు, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్, కార్పొరేటర్ సత్యనారాయణ



కూకట్‌పల్లి వై జంక్షన్ వద్ద కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రమేష్ తదితరులు

అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలి

- ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, పీఏసీ చైర్మన్ గాంధీ
- నియోజకవర్గ వ్యాప్తంగా అంబేడ్కర్‌కు ఘన నివాళి

అంబేడ్కర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎమ్మెల్యేలు మాధవరం కృష్ణారావు, ఆరెకపూడి గాంధీ అన్నారు. కూకట్‌పల్లి వై జంక్షన్ వద్ద ఎమ్మెల్యే కృష్ణారావు, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్, పీజేఆర్ నగర్‌లో పీఏసీ చైర్మన్ గాంధీ, ఆయా డివిజన్‌లలో కార్పొరేటర్లు, వివిధ సంఘాల నాయకులు అంబేడ్కర్ చిత్రపటాలు, విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అంబేడ్కర్ మహోన్నతమైన వ్యక్తి అని, పేద, బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి అని అన్నారు. అంబేడ్కర్ స్ఫూర్తితో యువత ముందుకు సాగాలన్నారు. -కూకట్‌పల్లి(జోన్‌బృందం)



పూలమాలేసి నివాళి అర్పిస్తున్న శేరి సతీష్ రెడ్డి



నివాళి అర్పిస్తున్న బహుజన రక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షులు దానియేల్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆనంద్



రిక్షాపుల్లర్స్ కాలనీలో ..కార్పొరేటర్ మాధవరం రోజాదేవి



మోతీనగర్ చౌరస్తాలో.. సామాజిక కార్యకర్త రవీంద్రనాథ్ ఠాగూర్



మూసాపేటలో పూలమాలేస్తున్న శ్రావణ్‌కుమార్ తదితరులు



హస్మత్‌పేట చౌరస్తాలో.. కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్, నాయకులు



ఎంసీహెచ్ఎస్ కార్యాలయంలో..ఇన్‌చార్జి చైర్మన్ హనుమంతరావు



వివేక్‌నగర్‌లో విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న బాబూరావు



కబీర్‌నగర్ చౌరస్తాలో నివాళి అర్పిస్తున్న నేతలు

పోషక లోపంపై అవగాహన

మూసాపేట: మూసాపేటలోని యూపీఎస్సీ అంగన్‌వాడీ టీచర్స్, ఆశావర్కర్లకు పిల్లల్లో పోషక లోపంపై శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్ వైజర్ మాట్లాడుతూ.. చిన్నారుల్లో పోషక లోపంపై వారి తల్లిదండ్రులకు వివరించాలని సూచించారు. ఏ ఆహారం తీసుకుంటే పోషక విలువలు అందుతాయో చిన్నారుల తల్లిదండ్రులకు, గర్భిణులకు తెలపాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు జ్యోతి, మాధవి, అనిత తదితరులు పాల్గొన్నారు.

బీజేవైఎం నేతల అరెస్ట్

కేపీహెచ్‌బీకాలనీ: జేఎన్‌టీయూహెచ్‌లో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కకు వినతిపత్రం ఇచ్చేందుకు వచ్చిన బీజేవైఎం నాయకులను కేపీహెచ్‌బీ పోలీసులు అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తరలించారు. శుక్రవారం ఉప ముఖ్యమంత్రి జేఎన్‌టీయూకు వస్తున్నారని తెలుసుకున్న బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కుమార్ యాదవ్, రాజు, రామకృష్ణ, సురేష్, మేకల రేవంత్ వినతిపత్రం ఇచ్చేందుకు మెయిన్‌గేట్ వద్దకు చేరుకున్నారు. పోలీసులు వెంటనే వారిని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం వారిని విడుదల చేశారు.

చిన్నారులకు యూనిఫాం అందజేత

మూసాపేట: ఫతేనగర్ డివిజన్ పరిధిలోని నేతాజీ కాలనీ, శివశంకర్ నగర్ కాలనీ, జింకలవాడలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఫతేనగర్ డివిజన్ కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్ చిన్నారులకు శుక్రవారం యూనిఫాంలను పంపిణీ చేశారు. చిన్నారులకు కావలసిన పలకలు, బ్యాగ్స్‌లను కూడా తన సొంత నిధులతో అందజేస్తానని తెలిపారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్ వైజర్ శోభారాణి, అంగన్‌వాడీ ఉపాధ్యాయురాళ్లు స్రవంతి, రేణుక, నాయకులు కంచి భిక్షపతి బాగయ్య, రాజు, సురేష్, ఆనంద్ గౌడ్, గోపాల్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



యూనిఫాం అందజేస్తున్న కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్ తదితరులు

న్యూ ఇయర్ వేడుకల్లో డ్రగ్స్ వాడితే కఠిన చర్యలు

గచ్చిబౌలి: న్యూ ఇయర్ వేడుకల్లో డ్రగ్స్ వాడినా, అనుమతించినా కఠిన చర్యలు తప్పవని మాదాపూర్ అడిషనల్ డీసీపీ జయరాం హెచ్చరించారు. శుక్రవారం మాదాపూర్ డీసీపీ కార్యాలయంలో న్యూ ఇయర్ వేడుకలు నిర్వహించే ఆర్గనైజర్స్‌తో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హోటల్స్, పబ్స్, కన్వెన్షన్ సెంటర్లు, ఇతర చోట్ల న్యూ ఇయర్ వేడుకలు నిర్వహించే వారంతా నిబంధనలు ఖచ్చితంగా పాటించాలని పేర్కొన్నారు. సౌండ్ పొల్యూషన్‌పై హైకోర్టు నిబంధనలు తూచ తప్పకుండా పాటించాలని, అన్ని అనుమతులు తీసుకోవాలన్నారు. మైనర్లను పనిలో పెట్టుకోరాదని, అంతటా సీసీ కెమెరాలు అమర్చాలన్నారు. ఇన్‌సైడ్ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ కోసం ప్రైవేట్ సెక్యూరిటీని నియమించాలన్నారు. ఈవెంట్ ఉన్న చోట ఇన్‌సైడ్ పార్కింగ్ సౌకర్యం కల్పించాలని, ప్రధాన రహదారులపై వాహనాలు నిలిపితే చర్యలు తీసుకుంటామన్నారు. పబ్‌లు, బార్ల నిర్వాహకులు డ్రైవర్లు, క్యాబ్‌లను అరేంజ్ చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మాదాపూర్ ఏసీపీ సీహెచ్. శ్రీకాంత్, ఇన్‌స్పెక్టర్లు హబీబుల్లాఖాన్, వెంకన్న, ఈవెంట్ ఆర్గనైజర్లు పాల్గొన్నారు.

రిజిస్ట్రార్‌పై మహిళా ప్రొఫెసర్ ఫిర్యాదు

కేపీహెచ్‌బీకాలనీ: కూకట్‌పల్లి జేఎన్‌టీయూహెచ్‌లో జరిగిన అంబేడ్కర్ వర్ధంతి కార్యక్రమానికి హాజరు కాకుండా గేటు వద్ద తనను అడ్డుకుని అవమానించారని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు యూనివర్సిటీ ఫారిన్ రిలేషన్స్ డైరెక్టర్, ప్రొఫెసర్ వసుమతి శుక్రవారం ఫిర్యాదు చేశారు. రిజిస్ట్రార్ వల్లే పోలీసులు, జేఎన్‌టీయూహెచ్ సెక్యూరిటీ తనను అడ్డుకున్నారన్నారు. రెక్టార్ విజయకుమార్ రెడ్డి స్పందించడంతో తనను అనుమతించారన్నారు. ఈ విషయమై రిజిస్ట్రార్ వెంకటేశ్వరావు స్పందించారు. ప్రొఫెసర్ వసుమతి పోలీసులకు ఐడీ కార్డు చూపకపోవడంతో అడ్డుకున్నారని, జేఎన్‌టీయూ సెక్యూరిటీ గమనించి లోపలకు అనుమతించాలని పోలీసులకు తెలిపారని చెప్పారు. ఆలోగా రెక్టార్ కూడా స్పందించారని తెలిపారు. కావాలని ఎవరూ అడ్డుకోలేదని మీడియాకు వివరించారు.

ఎన్నిక.. సన్మానం



పల్లపు వేణును సన్మానిస్తున్న నాయకులు

మోతీనగర్: కూకట్‌పల్లి యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన పల్లపు వేణును శుక్రవారం అవంతినగర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు గోపిశెట్టి రాఘవేందర్, మూసాపేట డివిజన్ అధ్యక్షుడు బొమ్మగాని సత్యనారాయణ గౌడ్, కేఏఎంసీ డైరెక్టర్ సుధాకర్ రెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

నిర్మాణ పనుల్లో నాణ్యత పాటించాలి

పీఏసీ చైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీ

ఆల్విన్‌కాలనీ: అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలని పీఏసీ చైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ అన్నారు. ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధి ఉషా ముళ్లపూడి రోడ్డులోని ఇండియన్ బ్యాంక్ నుంచి ఎల్లమ్మ చెరువు అలుగు వరకు రూ.2 కోట్ల అంచనా వ్యయంతో చేపడుతున్న వరద నీటి కాలువ నిర్మాణ పనులు, సీసీ రోడ్డు నిర్మాణ పనులను శుక్రవారం కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నాణ్యత విషయంలో ఎక్కడా రాజీ పడకూడదన్నారు. అవసరమైన చర్యలు, జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పనులను త్వరగా పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు ఆదేశించారు. ఆల్విన్‌కాలనీ డివిజన్ అభివృద్ధికి ఎల్లవేళలా కృషి చేస్తానని, శేరిలింగంపల్లి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో ఆదర్శవంతమైన నియోజకవర్గంగా తీర్చిదిద్దుతామని తెలిపారు. కార్యక్రమంలో ఏఈ శ్రావణి, వర్క్ ఇన్‌స్పెక్టర్ రవి, నాయకులు దొడ్ల రామకృష్ణ గౌడ్, సమ్మారెడ్డి, పాండుగౌడ్, జిల్లా గణేష్, శివరాజ్ గౌడ్, రవి, మార్నెళ్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్, చిల్డ్రన్ పార్కు పనులను పరిశీలిస్తున్న గాంధీ



నిర్మాణ పనుల గురించి తెలుసుకుంటున్న పీఏసీ చైర్మన్ గాంధీ

ఫంక్షన్ హాల్, పార్కు పనుల పరిశీలన

ఆల్విన్‌కాలనీ: ఎల్లమ్మబండ, పీజేఆర్ నగర్ కాలనీలో మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్, చిల్డ్రన్ పార్కు పనులను కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్‌తో కలిసి పీఏసీ చైర్మన్ గాంధీ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పీజేఆర్ నగర్‌లో రూ.2 కోట్ల వ్యయంతో మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్, కోటి రూపాయల అంచనా వ్యయంతో చిల్డ్రన్ పార్కు నిర్మాణం చేపడుతున్నామని తెలిపారు. ఫంక్షన్ హాల్‌ను అన్ని హంగులతో నిర్మిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఏఈ శ్రావణి, వర్క్ ఇన్‌స్పెక్టర్ రవి, నాయకులు దొడ్ల రామకృష్ణ గౌడ్, మార్నెళ్ల శ్రీనివాస్, శివరాజ్ గౌడ్, రవి, భాస్కర్, శ్రీనివాస్, యాదగిరి, అగ్రవాసు, మల్లేష్, మోజెస్ తదితరులు పాల్గొన్నారు.

నామినేషన్ పత్రాల దాఖలు



నామినేషన్ పత్రాలు దాఖలు చేసిన ప్రదీప్‌రెడ్డి, సంపత్ రెడ్డి ప్యానల్ సభ్యులు

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ ఫేజ్ 1 దీన్ దయాల్ వెల్ఫేర్ అసోసియేషన్ ఎన్నికలు ఈ నెల 15వ తేదీన జరుగనున్నాయి. ఈ ఎన్నికల్లో ప్రదీప్‌రెడ్డి, టి.సంపత్ రెడ్డి ప్యానల్ తరఫున ఎస్. ప్రదీప్ రెడ్డి అధ్యక్షుడిగా, టి. సంపత్ రెడ్డి జనరల్ సెక్రటరీగా, ఎం కృష్ణ గౌడ్ ఉపాధ్యక్షుడిగా, కె. వెంకటేశ్వర్లు కోశాధికారిగా, పీవీ సుబ్బారెడ్డి జాయింట్ సెక్రటరీగా, కె. శ్రీధర్ బాబు కల్చరల్ సెక్రటరీగా నామినేషన్ పత్రాలను ఎన్నికల అధికారికి శుక్రవారం దాఖలు చేశారు.